మధ్యతరగతి అమ్మ



చెంగు చెంగున పరుగెత్తుకు వెళ్తున్న ఖుజ్జిగాడు కాళ్ళు అడ్డం తగిలి కిందపడ్డాడు. దెబ్బ గట్టిగా తగిలింది. "అబ్బా!..." అనుకున్నాడు. మోకాలు దగ్గర కాస్త చర్మం రేగింది. లేచి నిలుచుని ఒకసారి తనను తాను చూసుకున్నాడు. చొక్కా అంతా మురికి మురికి అయిపోయింది ... అంతే ... నాప్కిన్ ఎక్కడికో ఎగిరిపోయింది.

ఆమ్మో ఖట్టలు ఇలా మురికి చేసుకుని ఇంటికి వెళ్తే అమ్మ తంతుంది... ఇప్పుడెలా ?... రేపటినుండి ఆడుకోడానికి పంపదు. ఇంట్లోనే చెల్లాయితో ఆడుకోమంటుంది. దానితో ఆడాలంటే

మల్లిక్



విసుగు. నా చేతిలో ఏదుంటే దానికి అదే కావాలంటుంది...అనుకున్నాడు.

మళ్ళీ వంగి ఒకసారి తన చొక్కా-వంక చూసుకున్నాడు. ఎంత మురికో?! ...చేత్తో మురికివున్న చోట దులుపు తున్నాడు. మరింత ఎక్కువగా మురికి చొక్కా-నిండా పులుముకుంది. బుజ్జిగాడికి ఏడుపొచ్చింది. అమ్మకేమని చెప్పాలి? రాజుగాడు తోసేశాడని చెప్తే అంత ఓళ్ళు తెలీకుండా పరుగెత్తుకొస్తున్నావా అని రెండు తంతుంది.

అబ్బా!...

మోకాలు మీద చురుకు చురుకు మంటుండే వంగి చూసుకున్నాడు. రేగిన చర్మం దగ్గర ఎర్రగా రక్తం!! ఈ దెబ్బ చూస్తే ఎక్కడలేని డబ్బూ మీ మందులకే సరిపోదు అని నాన్నా తంతాడు. అసలు నాయనమ్మ మందు లకే బోల్డంత ఖర్చవుతుంది...నాన్నేమో అందరికీ మందులకి ఖర్చవుతుందని అనవసరంగా అంటాడు.

మళ్ళీ మోకాలుమీద చురుక్ మంది. బుజ్జిగాడు వంగి మోకాలుమీద అరచెయ్యి ఆనించి గట్టిగా వత్తి కాస్సేపు పట్టు కున్నాడు. చేతికి రక్తం కాస్త జిగురుగా అంటుకుంది. నేలమీద చెయ్యి గట్టిగా

రుద్దాడు. రక్తం పోయింది. చెయ్యంతా మట్టి మట్టి అయ్యింది. రెండుచేతులూ దులుపుకుని మోకాలు చుట్టూ ఉన్న మట్టి దులుపుకుందామని వంగిన బుజ్జిగాడు అలానే ఉండిపోయాడు. వాడి కళ్ళు జిగేల్‌మన్నాయి. గుండె కాస్సేపు ఐరువుగా కొట్టుకుంది. అక్కడ... మట్టిలో అర్ధరూపాయి బిళ్ళ! ...చుట్టూ చూశాడు. ఎవరూ తనని చూస్తున్నట్లు అనిపించలేదు. వంగి అర్ధరూపాయిని చేతిలోకి తీసుకున్నాడు ఆది వాడికి కిలో రాయంత బరువనిపించింది. ఎవరైనా వచ్చి దాన్ని లాగేసుకుంటారేమోనని వాడికి భయమేసింది. చుట్టూ ఒకసారి దొంగలాగా పరికించి చూసి అర్ధరూపాయి బిళ్ళను లాగుజేబులో వేసుకుని ముందుకు పరుగెత్తాడు. వాడికి ఇప్పుడు కాలునొప్పి తెలియటంలేదు. ఆ అర్ధరూపాయే గనుక వాడికి దొరికి ఉండకపోతే వాడు ఇంటికి కుంటు కుంటూ వెళ్లేవాడే.

బుజ్జిగాడి చిన్నిమనసులో ఆలోచనలు మొదలయ్యాయి. వాడి గుండెలో ఆ అర్ధరూపాయి బిళ్ళ ఖంగు ఖంగుమని మ్రోగుతుంది. అర్ధరూపాయితో గాలిపటాలు కొనుక్కుంటే?...ఉహు... కాదు. స్కూలు వంటి బెల్లప్పుడు ఐస్ బ్రూట్ కొనుక్కోవాలి! ఆ సుబ్బిగాడు రోజూ ఐస్రూటు కొనుక్కుంటాడు. వాళ్ళమ్మ వాడికి రోజూ ఐదుపైస లిస్తుంది. అమ్మ నాకు ఆసలెప్పుడూ ఇవ్వదు. అర్ధరూపాయికి పది ఐస్రూటు ట్లొస్తాయ్!...పదిరోజులు కొనుక్కోవచ్చు!... పాపం. చెల్లాయికి కూడా ఇందిదగ్గర ఒక ఐస్రూటు కొనివ్వాలి! ...మరి గాలిపటమో? .... గాలిపటం కొండే నేనుకూడా ఎగరేస్తానని చెల్లాయి ఏడుస్తుంది. అది గాలివాటాన్ని చింపేస్తుంది. పోసి ఒక్క గాలిపటమే కొని మిగతా డబ్బులతో ఐస్రూట్లు కొనుక్కుంటేనో? ... అవును...అలా చేస్తే బావుంటుంది.

బుజ్జిగాడిలో ఉత్సాహం మరింత పెరిగింది. పరుగువేగంకూడా పెరిగింది. ఇల్లు వచ్చేసింది.

"ఏమిట్రా నీ బట్టలూ - నీ వాలకం కూలి వెధవలా....మీ బట్ట లుతకలేక రెక్కలు పడిపోతున్నాయి దరిద్రపు వెధవా!..."ఇంట్లోకి అడుగుపెడుతూనే అమ్మ దీవెనలు చెవినపడ్డాయి బుజ్జిగాడికి. తంతుందేమోనని భయపడ్డాను

"ఏదీ...లాగూ చొక్కా విప్పేసేయ్...వేరేవి తొడుగుతాను" అంటూ దగ్గరకు వచ్చింది అమ్మ.

బుజ్జిగాడి గుండెల్లో రాయిపడింది. లాగుజేబులోని అర్ధరూపాయి అమ్మ చూసిందంటే?!...

"బట్టలు విప్పుతుంటే గుడ్లు మిటకరిస్తావేరా వెధవా?..."చొక్కా గుండీల

మీద చెయ్యి వేసింది. బుజ్జిగాడు లాగు జేబులో చెయ్యిపెట్టి ఆర్ధరూపాయి బిళ్ళను తడుముకున్నాడు

అమ్మ లాగు విప్పి మూల పడేస్తుంది...బీరువాలోంచి ఇస్త్రీ బట్టలు తీసుకురావడానికి లోపలికి వెళుతుంది. ఆ ప్పుడు ఈ లాగుజేబులోని ఆర్ధరూపాయి తీసి ఎక్కడైనా దాచేయాలి!

చొక్కా విప్పి మూలకు విసిరేసింది. "లాగుజేబులోంచి చెయ్యితియ్..." లాగు కూడా విప్పి విసురుగా గది మూలకు విసిరేసింది అమ్మ. ఆ విసురులో లాగు జేబులోని ఆర్ధరూపాయి బిళ్ళ ఖంగున శబ్దంచేస్తూ నేలపైపడి కొంతదూరం దొర్లింది. బుజ్జిగాడి గుండె క్షణం ఆగింది. అమ్మచూపుకూడా ఆర్ధరూపాయి బిళ్ళమీద క్షణం ఆగింది. ఆమె ముఖం తీవ్రంగా మారింది.

"ఆర్ధరూపాయి ఎక్కడిదిరా?... నాన్నగారి జేబులుగాని సర్దుతున్నావా వెధవా...?"

"దొరికిందే..." బుజ్జిగాడు నీరసంగా జవాబు చెప్పాడు.

"ఎక్కడరా?..." అమ్మ కంఠంలో కుతూహలం—కళ్ళల్లో వెలుగు.

"ఆంజీలాసామి గుడి దగ్గర"

అమ్మ వంగి ఆర్ధరూపాయి తీసి మొల్లో దోపుకుంది.

"రేపు కూరకి వసికివస్తుంది."

బుజ్జిగాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకుని "ముఖం కడుగుతాను రా..." అంటూ బాత్రూముకు దారితీసింది.

బుజ్జిగాడికి ఏడుపొచ్చింది.